అడుగడుగునా ఆగాల్సిందే!

- నిత్యం ట్రాఫిక్ జామ్
- మెట్రో ఉన్న ప్రధాన రోడ్లపై తగ్గని ట్రాఫిక్
- కిలో మీటర్ మేర స్తంభిస్తున్న వాహనాలు



మలక్‌పేట్ నుంచి చాదర్‌ఘాట్‌కు వెళ్లె ప్రధాన రహదారి నిత్యం ఇలా..

దిల్‌సుఖ్‌నగర్: ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణించే జాతీయ రహదారులపై ట్రాఫిక్ స్తంభించి నరకం చవిచూడాల్సి వస్తోందని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. పెరుగుతున్న వాహనాల సంఖ్య..కుంచించుకుపోతున్న రహదారులతో ట్రాఫిక్ చక్ర బంధంలో చిక్కుకుపోతున్నారు. ఈ ప్రాంతాల్లో మెట్రో రైళ్లు నడుస్తున్న ట్రాఫిక్ మాత్రం తగ్గడం లేదు. రాత్రిపగలు తేడా లేకుండా ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యమైంది. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్, మూసారంబాగ్, మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, సైదాబాద్, చాదర్‌ఘాట్‌లో నిత్యం వాహనదారులు, పాదచారులు నరకం అనుభవిస్తున్నారు. ప్రతిరోజు రద్దీగా ఉండే వాహనదారులతో కిటకిటలాడే దిల్‌సుఖ్‌నగర్‌లోని జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను అదుపు చేయడం తలకు మించిన భారంగా మారుతోంది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, ఎల్‌బీనగర్‌ల పరిధిలోని ప్రధాన చౌరస్తాలలో ట్రాఫిక్ స్తంభించడం సాధారణమైంది.

పేరుకే జాతీయ రహదారి..

జాతీయ రహదారిపై ప్రయాణం ట్రాఫిక్ అడుగడుగునా అడ్డంకులను సృష్టిస్తోంది. నానాటికీ జాతీయ రహదారి ఆక్రమణకు గురవుతూ వస్తోంది. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్, ఎల్‌బీనగర్‌లలో జాతీయ రహదారిపైనే దర్జాగా వ్యాపారాలు, అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. దీనికితోడు పూర్తిస్థాయిలో రోడ్లు విస్తరణకు నోచుకోకపోవటంతో ఈ సమస్యకు కారణం అవుతోంది. పది నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యాన్ని రెండు గంటలైనా చేరుకోలేకపోతున్నారంటే ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు ఎల్‌బీనగర్ నుంచి అన్ని ప్రాంతాలకు మెట్రో రైళ్లు నడుస్తున్న ట్రాఫిక్ మాత్రం తగ్గేదేలేనట్టుగా ఉంటుంది. కొత్తపేట చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ మీదుగా చాదర్‌ఘాట్ వరకు వెళ్లాలంటే అడుగడుగునా ఆగాల్సిందే.

రోడ్ల విస్తరణ, ఆక్రమణలే కారణం..

నగరంలోని అతివేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా ఎల్‌బీనగర్‌కు పేరుంది. గత 30 ఏళ్లల్లో శివారు ప్రాంతాల్లో వందలకొద్ది కొత్తకాలనీలు ఏర్పడటంతో వాహనాల సంఖ్య కూడా పెరగడం వీటికి అనుకూలంగా రోడ్లు వెడల్పు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ముఖ్యమైన చౌరస్తాలలో సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎవరికి వారే ఇష్టానుసారంగా వెళ్తూ ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లేవారు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ స్తంభిస్తున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించి, సిగ్నళ్ల వ్యవస్థను పునరుద్ధరించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌జోన్‌తో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల్లో ఇటీవల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రాంతం గుండా శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు ప్రధానదారి కావడంతో వీఐపీలు, ప్రముఖులు రాపోకలు సాగిస్తున్న క్రమంలో ట్రాఫిక్‌నున ఆపాల్సి వస్తోంది. ఐదు నిమిషాలే ట్రాఫిక్‌ను ఆపితే కిలో మీటర్ల మేరకు వాహనాలు స్తంభిస్తాయి. ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించి చిరువ్యాపారాలు, తోపుడు బండ్లు కూడా ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతోంది. ఆయా ప్రాంతాల్లో ఉండే షాపింగ్‌మాల్స్, వ్యాపార సముదాయాలకు సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే తమ తమ వాహనాలను గంటల తరబడి నిలుపుతున్నారు.

పరిష్కార మార్గాలు..

- రద్దీ సమయాల్లో ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటుచేసి వాహనాలను నియంత్రించాలి.
- సర్వీస్ రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను తొలగించి చిన్న వాహనాలను ఇక్కడి నుంచి రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలి.
- ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి.
- అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు చేయాలి
- రద్దీ సమయాల్లో ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించాలి.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



నిరసన తెలుపుతున్న టీఎస్ఎస్ఏ నాయకులు

మలక్‌పేట: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూర్మెళ్ల మహేష్‌కుమార్ ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ గురువారం మూసారంబాగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యాశాఖ మంత్రులను నియమించకపోవడం దురదృష్టకరమైన అంశంగా పరిగణిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బకాయిలు, భవనాల అద్దెలు, వర్కర్ల జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విద్యార్థి ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సుధాకర్, మేడిరాజు, సతీష్, ఉదయ్, యోగి, శివ, భాను, తరుణ్ పాల్గొన్నారు.

పారా త్రోబాల్ క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మన్సూరాబాద్: ఇటీవల కంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన జట్టు సభ్యులైన గోనే చింటూరెడ్డి, రాకేష్ పాటిల్‌ను మన్సూరాబాద్ పెద్దచెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇన్‌స్పెక్టర్లు జలేందర్‌రెడ్డి, నాగరాజు మాట్లాడారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి స్వర్ణపతకం సాధించడంలో కీలకపాత్ర పోషించిన క్రీడాకారులను సన్మానించుకోవడం గర్వకారణమన్నారు. పారా క్రీడలకు ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం క్రీడాకారులకు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమారెడ్డి, సభ్యులు నాంపల్లి రామేశ్వర్, కార్తీక్, కృష్ణ, ఇబ్రాయిల్, శ్రీధర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రాములుగౌడ్, అంజయ్యగౌడ్, రాంబాబు, పోరెడ్డి కవిత తదితరులున్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మన్సూరాబాద్: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) 5వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఎంఎల్‌పీఐ (రెడ్‌ఫ్లాగ్) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఆర్.సంతోష్ పిలుపునిచ్చారు. టీయూసీఐ జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం కామినేని చౌరస్తా వద్ద ఆవిష్కరించి కార్మికులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రయోజనాలను కాలరాస్తుందన్నారు. దేశంలో ఉన్న 44 చట్టాలను కుదించి నాలుగు లేబర్‌కోడ్‌లను తెచ్చి కార్మిక వర్గాలను అన్యాయం చేస్తుందని విమర్శించారు. కార్మిక, కర్షక ఐక్యతతో హక్కుల సాధనకై పొరాటాలు చేయాలని కోరారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే మహాసభల్లో భారీగా తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,నాగరాజు, రవీందర్, శేఖర్, వెంకన్న, స్వామి పాల్గొన్నారు.

మానవత్వం చాటిన విద్యార్థులు



ఆహారాన్ని పంపిణీ చేస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: మాయమైపోతున్న మానవతా విలువలకు విద్యార్థులు కొత్త భాష్యం చెబుతున్నారు. పాఠశాలల సమీపంలో ఆకలితో అలమటించే కుటుంబాలకు ఏదో ఒక రూపంలో ఫుడ్ అందిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు. పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు సామాజిక బాధ్యతలో భాగంగా పల్లవి ఫుడ్ (ఎనిటైమ్ ఫుడ్)ను ప్రారంభించారు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపేందుకు పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్ అధినేత మల్కా కొమురయ్య, సీఈఓ యశస్వి ఆధ్వర్యంలో డైరెక్టర్ కార్తిక్ మార్గదర్శకత్వంలో, ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ సాగర్, ఫుడ్ ఏటీఎంను ప్రారంభించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి అనాథలకు పంపిణీ చేస్తుండటం మరో విశేషం. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రోజు తమ టిఫిన్ బాక్స్‌తో పాటు ఏదో ఒక రూపంలో టిఫిన్స్, లంచ్, ఫ్రూట్స్, పప్పులు, కూరగాయలు, తృణధాన్యాలు, ఇలా అదనంగా పేరెంట్స్ సాయంతో విద్యార్థులు తీసుకొచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను స్ట్రీట్‌లోని పేదవారికి పంచుతున్నారు. ఇది ఒకరోజు కాదని నిత్యం ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. చిన్నప్పటి నుంచే సామాజిక, నైతిక విలువలు నేర్పుతున్న పాఠశాలకు, నేర్చుకుంటున్న విద్యార్థులకు, పూర్తి సహకారం అందిస్తున్న పేరెంట్స్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


సత్యదేవుని ఆలయ ఘటనపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

ఉప్పల్ : ఇందిరానగర్‌లోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఇటీవల అయ్యప్ప స్వాములకు ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ సభ్యుడికి మధ్య జరిగిన వివాదాస్పద ఘటనల గురించి గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు హాజరై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములు, స్థానికులు దేవాదాయశాఖ అధికారులకు జరిగిన విషయాన్ని వివరించారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కోట్ల నర్సింహారెడ్డి తాను ఎలాంటి తప్పులు చేయలేదని, దేవాలయానికి సంబంధించిన నీటిని వృధా చేయొద్దని మాత్రమే చెప్పానన్నారు. సమగ్ర విచారణ అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దేవాదాయశాఖ సూపరింటెండెంట్ మోహన్, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవోలు వీరేశం, భాగ్యలక్ష్మి, అంజయ్య, రవికుమార్, చంద్రమోహన్, శంకర్ పాల్గొన్నారు.

మానవాళికి భగవద్గీత మార్గదర్శనం



ఉప్పల్: మానవాళిని సన్మార్గంలో నడిపే మార్గదర్శనం చేసే ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీత అని, భారతీయ సంస్కృతికి భగవద్గీత గొప్ప గోపురం లాంటిదని వక్తలు అన్నారు. రామంతాపూర్ ఆర్టీసీకాలనీ కమ్యూనిటీహాల్‌లో భగవద్గీత శ్లోకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రపంచానికి భగవద్గీతను ఉపదేశించిన రోజే గీతాజయంతి అని, భక్తి పూర్వకంగా గీతను పఠిస్తే అన్ని శుభాలే జరుగుతాయన్నారు. హైకోర్టు అడ్వకేట్ జీవీఎల్.నరసింహారావు ప్రముఖ రచయిత్రి డాక్టర్ కే.వి.కృష్ణకుమారి, సినీనిర్మాత గోపాలకృష్ణ, సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు కుప్పేశ్వర్‌రావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు సుబ్రహ్మణ్యం, లలితావాణి, భారతి కమలాకర్, కృష్ణవేణి, లలితాపరమేశ్వరి పాల్గొన్నారు.

శేషప్ప కవి జీవితం, సాహిత్యంపై వ్యాసరచన పోటీలు

సుల్తాన్‌బజార్: సుప్రసిద్ధమైన నరసింహ శతకకర్త ధర్మపురి శేషప్పకవి జీవితం, సాహిత్యంపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులైన యువతీ యువకులు పోటీలలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల రూపాయలతోపాటు తర్వాతి శ్రేణిలో మరి కొన్ని ప్రశంసాత్మక బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాసం నిడివి 10 పుటలకు మించరాదని తెలిపారు. తమ సొంత రచన అని స్వీయ ధ్రువీకరణ ఉండాలని, పదో తరగతి సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు. 2025 జనవరి 20వ తేదీలోగా చేరే విధంగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, అబిడ్స్, హైదరాబాద్–1 చిరునామకు పంపాలని ఆయన తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 15, వంకాయ రూ. 23, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 23, బీర రూ. 38, క్యాబేజి రూ. 16, ఫ్రెంచిబీన్స్ రూ. 48, క్యారట్ రూ. 40, దొండ రూ. 23–26, చిక్కుడు రూ. 40, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 23, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 35, దోస రూ. 18, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 50, చామగడ్డ రూ. 37. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గంజాయి విక్రేత అరెస్టు

చంచల్‌గూడ: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. మంగళవారం అర్ధరాత్రి మాదన్నపేట పోలీసులు ఇస్లామియా కాలేజీ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా యాక్టివాపై వెళ్తున్న ఓ యువకుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. యాక్టివాను తనిఖీ చేయగా 827 గ్రాముల గంజాయి లభించింది. నిందితుడు యాఖుత్‌పురాకు చెందిన మహ్మద్ ఇబ్రహీం హుస్సేన్ అలియాస్ సజ్జు (33)పై కేసు నమోదు చేశారు.

లోన్ ఇస్తానని రూ.1.12 లక్షలు కాజేశాడు

నాగోలు: లోన్ ఇస్తానని రూ.1.12 లక్షలు కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..ఏపీలోని తూనికి చెందిన ముప్వల మల్లేశ్వర్‌రావు, ప్రైవేట్ ఉద్యోగి. నగరానికి వచ్చి ఎల్‌బీనగర్ ఎస్‌బీహెచ్ కాలనీలో ఉంటున్నాడు. గత నెల 28న ఫేస్‌బుక్‌లో బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన ఈఎంఐపై రూ. 5 లక్షల లోన్‌ను ప్రమోట్ చేసే యాడ్‌ను చూసి అక్కడున్న లింక్‌ను తెరిచి అందులో అతడి ఫోన్ నంబర్‌ను నమోదు చేయగా వెంటనే ఓ కాల్ వచ్చింది. మీకు లోన్‌పై ఆసక్తి ఉంటే మొత్తం మంజూరు చేస్తానని.. అందుకు వివరాలు పంపాలని చెప్పడంతో మల్లేశ్వర్‌రావు తన ఆధార్, ఫొటో, పాన్ కార్డులు పంపించాడు. వేలూరి ప్రతాప్‌రెడ్డి అనే బజాజ్ కంపెనీకి చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ప్రతాప్‌రెడ్డి ప్రాసెసింగ్ ఫీజు పేరుతో రూ. 3500 అడగడంతో మాదబి దాస్ అనే ఖాతాకు నగదు పంపించాడు. ఆ తర్వాత వివిధ ఫీజుల పేర్లతో రూ. 1,12,535 పంపించుకున్నాడు. ఎంతకీ లోన్‌కు సంబంధించిన ఎలాంటి వివరాలు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి



విజేతలతో జయశ్రీ, రాధాకృష్ణ

మలక్‌పేట: విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాలని సైదాబాద్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ తిరునగరి రాధాకృష్ణ అన్నారు. మూసారంబాగ్ స్వామి వివేకానంద స్కూల్లో గురువారం నిర్వహించిన సీఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమానికి ఆయన మండల తహసీల్దార్ జయశ్రీతో కలిసి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఖోఖోలో సైదాబాద్ టీజీఎంఆర్ఎస్ విన్నర్, మూసారంబాగ్ ఎస్‌వీసీ రన్నర్‌గా నిలిచారు. కబడ్డీలో మలక్‌పేట జూనియర్ కాలేజ్ విన్నర్ , మూసారంబాగ్ ఎస్‌వీసీ హెచ్ఎస్ రన్నర్, వాలీబాల్‌లో మూసారంబాగ్ ఎస్‌వీసీ హెచ్ఎస్ విన్నర్, నవ్య జూనియర్ కాలేజ్ రన్నర్‌గా నిలిచారని స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివకుమార్, స్కేటింగ్ కోచ్ నిర్మల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న వెంకటేష్ గౌడ్

నాగోలు: గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అన్యాయం చేసిందని, ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తోందని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ.7.90 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల చేస్తానని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బత్తుల అంజయ్య, మల్లేబోయిన రమేష్ గౌడ్, శోభన్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు

ఉప్పల్ : రాచకొండ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్ ఆదేశాల మేరకు రాచకొండ 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్' (ఏహెచ్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం రాధిక చౌరస్తాలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు, యాంటీ ర్యాగింగ్, సెల్‌ఫోన్, మైనర్ రైడింగ్ తదితర నేరాలతో పాటు బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏలపై విద్యార్థులకు వివరించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఇంట్లో వారికి కూడా చెప్పాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. మానవ అక్రమ రవాణాలో ప్రపంచంలో దేశం మూడో స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ మోసాలకు గురైన వారు డయల్ 1930, హెల్ప్‌లైన్ 1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 109, 112 డయల్ 100లను వినియోగించుకుని రక్షణ పొందాలన్నారు. ఎస్సై రాములునాయక్, ఏఎస్ఐ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంపై..

మేడిపల్లి: డ్రగ్స్ వినియోగానికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని విద్యార్థులకు మేడిపల్లి పోలీసులు సూచించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజ్ పర్వతాపూర్‌లో డ్రగ్స్, మహిళల సంబంధిత, సమస్యలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ తదితర విషయాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మేడిపల్లి పోలీసులు విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలు డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలైతే విలువైన జీవితం నాశనమవుతుందన్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు, తల్లిదండ్రులు తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. టీజీఏన్‌బీ, డీయస్పీ రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, షీ టీమ్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అర్హులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని షిర్డీసాయినగర్ కాలనీకి చెందిన ఉమా గౌరీశంకర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను గురువారం ఎమ్మెల్యే, గౌరీశంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ ఓల్డ్ బస్తీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, నాయకులు స్వామిరాజ్, కృష్ణగౌడ్, శ్రవణ్‌కుమార్, సురేష్, వెంకటేష్, రాము పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన క్లబ్‌ల ప్రతినిధులు

వనస్థలిపురం: శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం నిర్వహించిన వాసవి క్లబ్ వనస్థలిపురం సర్వసభ్య సమావేశంలో వాసవిక్లబ్ వనస్థలిపురం, వనితా క్లబ్ వనస్థలిపురం నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. వనస్థలిపురం అధ్యక్షుడిగా అల్వాల మురళీధర్‌గుప్తా, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా పొలిశెట్టి కృష్ణమూర్తి, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా అల్వాల ఉషారాణి, కార్యదర్శిగా చిగురంబొట్ల స్వప్న, కోశాధికారిగా పొలిశెట్టి ఉమాదేవి ఎన్నికయ్యారు.

పాఠశాలలను శుభ్రంగా ఉంచాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రభుత్వ పాఠశాలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీ ఉన్నత ప్రభుత్వ పాఠశాలను గురువారం కార్పొరేటర్ పరిశీలించి మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని పాఠశాలలోని సమస్యలు పరిష్కరించి అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయమ్మ, ఏఈ రాజ్‌కుమార్, ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, ఎస్ఎఫ్ఏ రాజ్ పాల్గొన్నారు.

17న సీఎం కప్ క్రీడాపోటీలు

మహేశ్వరం: ఈ నెల 17న మండల కేంద్రంలో గడికోట మైదానంలో మండల స్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శైలజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న యువజన సంఘాలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. సీఎం కప్ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ ఫోన్ నెం 9440007206ను సంప్రదించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారురాలికి చెక్కు అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: ఆపదలో ఉన్న పేద ప్రజలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి సూచించారు. మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన రాసాల మల్లమ్మకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోనికాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, సురేందర్ రెడ్డి, బర్రె రాజ్‌కుమార్, వెంకటేశ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.